రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.32 (మంగళవారం సాయంత్రం)
సహర్ : 5.00 (బుధవారం ఉదయం)
ఎవరైతే ఇతరుల పట్ల ప్రేమ, కరుణ, జాలి చూపరో.. అలాంటి వారిని అల్లాహ్ కరుణించడు.



జిల్లా న్యాయాధికారితో ఎస్పీ అఖిల్

జిల్లా న్యాయాధికారిని కలిసిన ఎస్పీ

ఆదిలాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అఖిల్‌మహాజన్ సోమవారం జిల్లా న్యాయాధికారి, అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.ప్రభాకర్‌రావు, జిల్లా అదనపు డిస్టిక్ సెషన్ న్యాయాధికారి డా.పి.శివరాంప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి పూలబొక్కెను అందజేశారు. న్యాయస్థానం పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై చర్చించారు. రానున్న లోక్ అదాలత్‌లపై ప్రత్యేకదృష్టిని సారిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా ఇరువర్గాల వారిని ఒప్పిస్తూ ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని వారు ఈ సందర్భంగా చర్చించుకున్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు అన్యాయం చేసిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆరోపించారు. విదేశీ విద్యపై అసెంబ్లీలో సోమవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పేద, దళిత, గిరిజన విద్యార్థులకు పైచదువుల కోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు విదేశాల్లో చదువుల కోసం రూ.25 లక్షలు ఇస్తానని చెప్పి ఇప్పుడు విద్యార్థులను ఆగం చేసిందన్నారు.

అలాగే, రాష్ట్రంలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో ఎలాంటి సౌకర్యాలు లేవని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారు. వసతులు లేక విద్యార్థులు గోడలు దూకి ఇంటికి వెళ్లిపోతున్న పరిస్థితులు ఉన్నాయని, అలాగే పిల్లలు బయటకు వెళ్లిపోయినా పట్టించుకునే నాథుడు లేడని విమర్శించారు. ఇప్పటికైనా ఈ విషయమై దృష్టిలో పెట్టుకుని అన్ని వసతులు కల్పించాలని కోరారు.

తాగునీటి ఎద్దడిపై స్పందించాలి

బోథ్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి ఎద్దడి ఉన్నట్లయితే సత్వరమే గ్రామాల కార్యదర్శులు స్పందించాలని సోనాల ఎంపీడీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామాల కార్యదర్శిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి ఉన్నట్లు గుర్తించిన వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపించాలన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న బోరుబావులను మరమ్మతులు చేయించడంతోపాటు మిషన్ భగీరథ నీటి సరఫరాపై పరిశీలించాలని సూచించారు. అలాగే ప్రైవేట్ వ్యక్తుల ఇళ్లలో నుంచి బోరుబావులను లీజుకు తీసుకొని తాగునీటి వసతి కల్పనకు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో వివిధ గ్రామాల కార్యదర్శి పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి : చైర్మన్

ఇంద్రవెల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, సొసైటీ సీఈవో ధర్మసింగ్, డిప్యూటీ సీఈవో తుమ్మల సునీల్, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ కుట్రలు చేయవద్దు'

ఉట్నూర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు రాజ్యాంగబద్ధంగా అనుభవిస్తున్న రిజర్వేషన్లను అభివృద్ధి చెందిన కులాలకు పంచి పెట్టాలని బీజేపీ కుట్రలు చేయడం సరైనదని కాదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ ఇటీవల పార్లమెంట్ సమావేశాలలో ఎంపీ డీకే అరుణ వాల్మీకి కులాలను ఎస్టీలో కలపాలని మాట్లాడడాన్ని ఖండిస్తున్నామ న్నారు. ఇందులో జిల్లా కోశాధికారి కుమ్ర జైతు, నాయకులు అరక ఓమేశ్, ఏఎస్పీ మండల అధ్యక్షులు తొడసం ఇంద్రులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు ప్రత్యేక ప్రాధాన్యత

తలమడుగు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణంలో గిరిజన గ్రామాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పొన్నగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, కలెక్టర్ సహకారంతో మండలానికి రూ. కోటి 80 లక్షల నిధులు ఉపాధి పథకం ద్వారా సీసీ రోడ్లు, మురికి కాలువల కోసం మంజూరు అయ్యాయన్నారు. ఇందులో మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మిరాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ బాపన్న, మాజీ వైస్ ఎంపీపీ పేదల దివ్య మాధవ్, గ్రామ పటేల్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు, తదితరులున్నారు.



● ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా కనిపిస్తున్న ఎన్టీఆర్ చౌక్
● నిర్మానుష్యంగా కనిపిస్తున్న జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారి
● ఎండల తీవ్రతకు స్కార్ఫ్ ధరించి వెళ్తున్న యువతులు

సుర్రుమంటున్న.. సూర్యుడు!

- జిల్లాలో అత్యధికంగా 42.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఉదయం 9గంటలకే భానుడి భగభగలతో జంకుతున్న జనం
- అడుగంటుతున్న భూగర్భ జలాలు.. ఎండిపోతున్న యాసంగి పంటలు
- ఊపందుకున్న సీజనల్ వ్యాపారాలు, పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- ముందు జాగ్రత్తలే మేలు : వైద్య నిపుణులు

ఆదిలాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. మార్చిలోనే రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోనే రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఠారెత్తిస్తున్న ఎండలతో జనం బెంబెలెత్తి పోతున్నారు. ఉదయం నుంచే సూర్యుడు సుర్రుమనిపించడంతో ఉదయం 9 గంటలకే బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే.. రాబోయే ఏప్రిల్, మే మాసాలలో పరిస్థితి ఎలా ఉంటుందో?నన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సోమవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 40.3 డిగ్రీలు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.7 డిగ్రీలుగా నమోదయ్యాయి. అలాగే బేల మండలంలో అత్యధికంగా 42.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జైనథ్‌లో 41.7, ఆదిలాబాద్ రూరల్‌లో 41.6, మావల 41.5, ఆదిలాబాద్ అర్బన్‌లో 41.2, గాదిగూడ 40.9, బోథ్ 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, బజార్‌హత్నూర్ మండలంలో కనిష్ఠంగా 36.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే జిల్లాలో వానాకాలం, శీతకాలం, వేసవి కాలం మూడు కాలాలు అధికంగానే ప్రభావాన్ని చూపుతాయి. గతేడు వేసవిలో అత్యధికంగా 45.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన దాఖలాలు ఉన్నాయి. ఈ యేడు మార్చిలోనే 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అంతేకాకుండా వడగాలుల ప్రభావంతో పగలంతా తీవ్రమైన

గత వారం రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలిలా..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
మార్చి 12	38.3	19.2
మార్చి 13	39.8	22.7
మార్చి 14	40.3	22.2
మార్చి 15	40.8	24.2
మార్చి 16	40.8	24.0
మార్చి 17	40.3	22.7

ఎండలు కనిపిస్తున్నా.. రాత్రి వేలల్లో వడగాలులు వీస్తున్నాయి. రాబోయే వారం రోజుల్లో ఎండల తీవ్రత మరింత ఎక్కువగానే ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమతంగా ఉండాలని వైద్యులు హెచ్చరికలు చేస్తున్నారు.

కాలానికి అనుగుణంగా ఏర్పాట్లు

వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ప్రజలు కాలానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పెరిగిన ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. వడగాలుల ప్రభావం కూడా ఎక్కువగానే కనిపిస్తోంది. వడగాలుల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల ప్రదేశాలను ఆశ్రయిస్తున్నారు. ఎండల తీవ్రతకు రాత్రీపగలు అనే తేడా లేకుండా.. ఏసీలు, కూలర్లను విపరీతంగా ఉపయోగిస్తున్నారు. ప్రధానంగా ఉపాధి కూలీలు మండిపోతున్న ఎండలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఒంటిపూట బడులతో పాటు అంగన్‌వాడీల కు సమయాన్ని కుదించింది. రైతులు, కూలీలు ఉదయం వేలల్లో పనులు ముగించుకుని మధ్యాహ్నం సమయంలో సేదతీరుతున్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత వ్యవసాయ పనులకు తిరిగి వెళ్తున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దీంతో పట్టణ రోడ్లన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారి కనిపిస్తున్నాయి.

ప్రశ్నార్థకంగా యాసంగి సీజన్

తీవ్రమైన ఎండలకు ఇప్పటికే చాలాచోట్ల పంటలు ఎండుముఖం పడుతున్నాయి. భూగర్భజలాలు వేగంగా పడిపోవడంతో చెరువులు కుంటలు, బోరుబావులు, వాగులు అడుగంటుకపోతున్నాయి. పంటలు చేతికి వస్తున్న సమయంలోనే ఎండుముఖం పట్టడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు పంటలను కాపాడుకునేందుకు

(తరువాయి 6వ పేజీలో...)



అర్జీదారు నుంచి పిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా



పిప్పర్‌వాడలో ఏఐ ఆధారిత బోధన కేంద్రాన్ని ప్రారంభిస్తూ..

సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

● జిల్లా అధికారులతో సమావేశంలో కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వేసవి పరిస్థితులను ఎదుర్కొనే విధంగా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వేసవిలో వడగాలులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్ కార్యాచరణ ప్రణాళికా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వేసవి కాలంలో వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. ఈ యేడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని రోజు రోజుకు పెరిగి పోతున్న ఉష్ణోగ్రతల సందర్భంగా మానవ, జంతుజీవాల పై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు సరిగ్గా పని చేస్తున్నాయో లేవో చూడాలన్నారు. ఆశాకార్యకర్తల నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు అప్రమత్తంగా ఉండి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు ఎవరు బయటకు రావద్దని అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దన్నారు. బయటకు వెళ్లవల్సి వస్తే గొడుగు, తలపై టోపీ, రుమాలు ధరించాలన్నారు. వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రతి కూడళిలలో చలివేంద్రాలు, కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వడగాల్పుల వల్లే వచ్చే ప్రమాదాలు, నష్టాలపై జాగ్రత్తలను వివరిస్తూ ప్రచారబోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమ్మర్‌హీట్ వేవ్ నిర్వహణ కోసం జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాకు సంబంధించిన ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్, అటవీ శాఖాధికారి ప్రశాంత్ బాజీరావుపాటిల్, ఆర్డీవో వినోద్‌కుమార్, విద్యాశాఖాధికారి ప్రణీత, డీఎంహెచ్‌వో నరేందర్, డీఆర్డీవో, డీపీవో, ట్రాన్స్‌పోర్టు, విద్యుత్, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● ప్రజవాణి అర్జీలపై నిర్లక్ష్యం చేయవద్దు

ఆదిలాబాద్: ప్రజావాణికి వచ్చే అర్జీలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో 82 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, మిషన్ భగీరథ, నీటి సమస్య, ఆసరా పింఛన్లు, ఇరిగేషన్, భూసర్వే, గ్రామ పంచాయతీ, ఇతర శాఖలకు సంబంధించిన శాఖల పై దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్, ఆర్డీఓ వినోద్‌కుమార్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

జైనథ్: జిల్లాలోని ఆయా గ్రామాలలో గల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం ఉమ్మడి జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఐదవ తరగతి విద్యార్థులకు అందించే ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ద్వారా జరిగే ఏఐ ఆధారిత బోధన తరగతులను కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు. దీని ద్వారా విద్యార్థులు ఉత్సాహంతో నేర్చుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి టి.ప్రణీత, ఎంఈవో గంగుల శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌లతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ సమావేశ మందిరంలో అర్జీలను స్వీకరిస్తున్న పరిపాలన అధికారి

పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

● అర్జీలను స్వీకరించిన పరిపాలన అధికారి

ఉట్నూర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పోడు వ్యవసాయం చేస్తున్న తమకు హక్కు పత్రాలు ఇవ్వాలంటూ గిరిజనులు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పరిపాలన అధికారి దామోదర్ స్వామి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుంగాపూర్, భగవాన్పూర్, జామిని, తదితర ప్రాంతాలకు చెందిన 14 మంది గిరిజనులు అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలని దరఖాస్తులు పెట్టుకున్నారు. అలాగే కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని మైసంపేట్, రాంపూర్ గ్రామాలకు చెందిన పునరావస గ్రామంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆ గ్రామాల గిరిజనులు తరలివచ్చారు. ఆదిలాబాద్ మండలంలోని అసోడ, పున్నగూడ ప్రాంతాల రోడ్ల పనులు చేపట్టాలని గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. గిరి వికాసం పథకం ద్వారా బోర్లు, కరెంట్‌ఝరి, దాబేకే,కరంజి, సఖినాపూర్, లక్ష్మీపూర్, లక్కారం, తదితర ప్రాంతాలకు చెందిన గిరిజన రైతులు దరకాస్తులు సమర్పించారు. ఇందులో మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా : ఎస్ఈ

ఆదిలాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి నిరంతరంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఎస్టిమేట్లకు సంబంధించిన నివేదికలు, వివరాలను తెలుగులో అందిస్తున్నామని తెలిపారు. అలాగే రైతుల సెల్ నెంబర్లకు ఎస్ఎంఎస్‌లు కూడా తెలుగులోనే పంపిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల మరమ్మతులు, ఇతర వసతులను విద్యుత్ శాఖనే పూర్తిగా సమకూరుస్తోందని, రైతులు సొంతంగా ఎలాంటి ఖర్చు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. రైతు శ్రేయస్సు దృష్ట్యా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమంలో భాగంగా వంగిన స్తంభాలు, లూజు వైర్లను సరిచేయడం లాంటి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మోటర్లకు కెపాసిటర్లను పెట్టుకోవాలని సూచించారు.

సరిహద్దుల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి



బేల పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసకుంటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అక్రమ రవాణాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం బేల మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను, ఆవరణలో ఉన్న వాహనాలను పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదుదారుల ఫిర్యాదులపై పక్కాగా దర్యాప్తు జరిపి తగిన న్యాయం చేకూరే విధంగా కృషి చేయాలని సూచించారు. పోలీసు స్టేషన్ మహారాష్ట్రతో సరిహద్దు కలిగి ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించాలని సూచించారు. అక్రమంగా రవాణా జరిగే వాటిని పూర్తిగా అడ్డుకట్ట వేయాలని, పోలీసు స్టేషన్‌లో సిబ్బంది ప్రతి ఒక్కరికి అన్నిరకాల విధులను కేటాయిస్తూ నిష్ణాతులను చేయాలని సూచించారు. ఇందులో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు కె.ఫణిదర్, డి.సాయినాథ్, ఎస్సైలు దివ్యభారతి, ముజాహిద్, సిబ్బంది ఉన్నారు.

ఆదిలాబాద్: పిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి తగిన న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత పోలీసు స్టేషన్లకు ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రతీ సోమవారం ప్రత్యేకంగా ప్రజల కోసం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో అందుబాటులో ఉండడం జరుగుతుందన్నారు. అన్ని పోలీసు స్టేషన్లలో ప్రజల కోసం రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కానప్పుడు జిల్లా ఎస్పీని సంప్రదించాలని సూచించారు. సోమవారం మొత్తం ఎనిమిది ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వాటిలో కొన్ని కుటుంబ సమస్యలు, కేసుల పరిష్కరించే సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. బాధితులకు సరైన న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిణి జైస్వాల్ కవిత, సిబ్బంది, తదితరులున్నారు.

సోనాల పాఠశాలలో ఎంఈవో విచారణ

బోథ్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు రావడంతో సోమవారం ఎంఈవో మహమ్మద్ హుస్సేన్ విచారణ చేపట్టారు. డీఈవో ఆదేశాల మేరకు పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యా కమిటీ చైర్మన్, వీడీసీ చైర్మన్‌ల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వీడీసీ చైర్మన్ తుల శ్రీనివాస్‌తో పాటు విద్యా కమిటీ చైర్మన్ సమక్షంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో పాఠశాలకు మంజూరైన వివరాలను, ఖర్చు అయిన నిధుల వివరాలను పరిశీలించారు. ఆ తర్వాత ప్రభుత్వపరంగా వచ్చిన నిధులను సహచర ఉపాధ్యాయులకు విద్యా కమిటీ చైర్మన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి

ఉట్నూర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులు ఈ వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించి కానుకగా ఇవ్వాలని మండలంలోని సాలెవాడ(కె) జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల హెచ్‌ఎం సింగిడి రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనవాయితీగా వస్తున్న వీడ్కోలు పార్టీకి 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పార్టీని ఏర్పాటు చేశారన్నారు. ఇందులో పాఠశాల చైర్మన్ అమ్రపాల్, ఉపాధ్యాయులు జాదవ్ రవికుమార్, మనోజ్‌కుమార్, శ్రీధర్, గౌతమ్‌కుమార్, సంగీత, తదితరులున్నారు.

సీసీఐపై స్పష్టమైన ప్రకటన చేయాలి

ఆదిలాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల్లో సీసీఐ పరిశ్రమ తుక్కు మాత్రమే విక్రయిస్తున్నామని, పరిశ్రమను కాదని ఆ శాఖకు చెందిన కేంద్ర మంత్రితో ప్రకటన విడుదల చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో చేరికల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో బీజేపీ పార్టీకి చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి మాజీ మంత్రి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడారు. ఇందులో ఇజ్జగిరి నారాయణ, అజయ్, సలీం, పండ్ల శ్రీనివాస్, కుమ్ర రాజు, కొండ గణేష్, కోవ రవి, నల్ల మహేందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం'

తలమడుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలుపరచడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ రైతుబంధు కింద ఎకరానికి 15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పటివరకు వేయలేదు అన్నారు. కొంత మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకులో అధిక వడ్డీ రుణాలు చెల్లించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఆ తర్వాత ఖోడద్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇందులో పార్టీ నాయకులు కేదారేశ్వర్, రమాకాంత్, పిడుగు అభిరామ్ రెడ్డి, కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ప్రకాష్, తదితరులున్నారు.

'అభివృద్ధి చేసే నాయకుడిపై అబద్ధాలు'

నేరడిగొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చేసే నాయకుడిపై కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి మజర్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. 60ఏళ్ల కాంగ్రెస్ చీకటి పాలన లోంచి బయటపడ్డ తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో బంగారు తెలంగాణ దిశగా అభివృద్ధి చెందిందన్నారు. అందులో భాగంగా ప్రత్యేకంగా రాష్ట్రంలో విద్య, వైద్యంపై గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దృష్టి పెట్టి రాష్ట్రంలో దాదాపు వెయ్యికిపైగా గురుకుల గిరిజన, ఆశ్రమ, మైనారిటీ, బీసీ పాఠశాలలను అభివృద్ధి చేసి ముందుకు నడిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ఫుడ్ పాయిజన్ వల్ల 49 మంది విద్యార్థులను పొట్టనపెట్టుకుందని అన్నారు. అలాగే, కాంగ్రెస్ చేస్తున్న తప్పులను కప్పిపుచ్చుకునేందుకే అబద్ధాల ప్రతినిధిని పెట్టుకుందని వారు ఆరోపించారు.



రైతులను సముదాయిస్తున్న జైనథ్ ఎస్సై పురుషోత్తం



జైనథ్‌లో నిలిచిపోయిన శనగ పంట కొనుగోలు

నిలిచిన శనగ పంట కొనుగోళ్లు

● జైనథ్ మార్కెట్ యార్డులో రైతుల ఆందోళన ● పాత హమాలీలకే పంట కొనుగోలును అందిస్తామన్న రైతులు
● మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డిమాండ్

జైనథ్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నాఫెడ్ మార్క్‌ఫెడ్ ద్వారా జరుగుతున్న శనగ కొనుగోళ్ల హమాలీ పాత కూలీలు, కొత్త కూలీల కారణంగా సోమవారం శనగ కొనుగోళ్లు నిలిచి పోయాయి. సంబంధిత మార్కెట్ కార్యదర్శి టి.దేవన్న ఇటీవల నిర్వహించిన మార్కెట్ కమిటీ సమావేశంలో కొత్త కూలీలు సంబంధిత మార్కెట్ మర్చంట్‌కు విక్రయించాల్సిందిగా తీర్మానం చేశారు. దీంతో శనగ పంటను తీసుకొని వచ్చిన జైనథ్, బేల మండలాల రైతులు తాము పాత హమాలీలు ఉంటేనే తప్ప విక్రయించబోమని రైతులు పట్టుబట్టారు. దీంతో శనగ కొనుగోళ్లు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. కాగా సంబంధిత మార్కెట్ చైర్మన్‌కు పాత హమాలీ కాంట్రాక్టర్ నుంచి రూ.1.50 లక్షలు డిమాండ్ చేయగా.. ఆయనకు పోన్ పే ద్వారా రూపాయలు ముట్టచెప్పినట్లు హమాలీల కాంట్రాక్టర్ మనోజ్ తెలిపారు. దీంతో శనగ రైతులు జైనథ్ మార్కెట్ యార్డులో ఆందోళనకు దిగారు. కాగా జైనథ్ ఎస్సై వి.పురుషోత్తం రంగ ప్రవేశం చేసి రైతులను సముదాయించారు. అనంతరం పాత హమాలీల ద్వారా శనగ కొనుగోళ్లు ప్రారంభించడంతో రైతులు ఆందోళన విరమించారు.



జైనథ్ మార్కెట్ కార్యదర్శి దేవన్నను నిలదీస్తున్న రైతులు

బస్టాండ్ ప్రహరీ నిర్మాణంపై విచారణ

బోథ్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బోథ్ బస్టాండ్‌లో ప్రహరీ గోడ నిర్మాణంపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులతో స్థల పరిశీలన కోసం సోమవారం నిర్మల్ డిపో మేనేజర్ ప్రణీత రెడ్డి విచారణ చేపట్టారు. అయితే విచారణ సందర్భంగా కొంతమంది వ్యక్తులు రంగప్రవేశం చేసి ఆందోళన సృష్టించారు. అయితే, వకావాలని అల్లర్లకు పాల్పడ్డారని పలువురు పేర్కొంటున్నారు. కాగా ప్రహరీ గోడ నిర్మాణం గతంలో నిర్ణయించిన ప్రకారమే నిర్మించడం జరుగుతుందని డిపో మేనేజర్ స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తుల ఇళ్ల ముందు ఉన్న రోడ్డు గ్రామ పంచాయతీకి సంబంధించినదని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగల బతుకుల్లో వెలుగులు : ఎమ్మార్పీఎస్

ఆదిలాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల బతుకుల్లో వెలుగులు నిండుతాయని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరేపల్లి మల్లేష్‌మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన నిరాహార దీక్షలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ మాదిగల 70 ఏళ్ల ఆకాంక్ష అని అన్నారు. వర్గీకరణ లేకపోవడం వల్లనే మాదిగ జాతి విద్య, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కాంబ్లే బాలాజీ మాదిగ మాట్లాడారు.

బోథ్: బోథ్‌లో చేపట్టిన ఎమ్మార్పీఎస్ దీక్షలు సోమవారం ఆరవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూడా స్వామి మాట్లాడారు. ఇందులో కారం రవి, అన్నపాక అశోక్, మండల నాయకులు ఓరుగంటి సుభాష్, అయిన్ల మహేష్, కారం లక్ష్మణ్, తదితరులున్నారు.

'వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కించపరిచే విధంగా సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారం చేస్తూ పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సామ రూపేష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం బేల పోలీసు స్టేషన్‌లో ఎస్సై దివ్యభారతికి ఫిర్యాదును అందించారు. సీఎం ప్రతిష్ఠకు భంగం కలిగిస్తూ అవమానకరమైన, అసభ్యకరమైన పోస్టులను ఎక్స్ ట్విట్టర్ ద్వారా పెడుతున్న నేరస్థుల పై విచారణ చేపట్టిన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంత మంది బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నేతలు ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేస్తూ వీడియోలు పెడుతున్నారని ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని బేల ఎస్సై దివ్యభారతి పేర్కొనట్లు తెలిపారు.

ఉట్నూర్: సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర హితం కోసం చేస్తున్న అభివృద్ధి పనులను జీర్ణించుకోలేక సోషల్ మీడియా వేదికగా రండ రేవంత్ అంటూ ఎన్‌ఆర్‌ఐ రవి పులుసు చేసిన వ్యాఖ్యలను యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ ఉపాధ్యక్షుడు అరికిళ్ల పరమేశ్వర్ తీవ్రంగా ఖండించారు. సోమవారం ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో రవి పులుసుపై ఫిర్యాదు చేశారు.

'అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే అబద్ధాలు'

బోథ్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అబద్ధాలు మాట్లాడారని కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి పశుల చంటిలు ఆరోపించారు. తమ ప్రభుత్వం హాస్టళ్లలో వసతులు కల్పించడంతో పాటు మిస్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలి పెట్టారని వారు ఈ సందర్భంగా విమర్శించారు.



పెన్‌గంగా నదిలో బావిని తవ్వి పంటలకు నీరందిస్తున్న రైతులు

సుర్రుమంటున్న సూర్యుడు!

(5వ పేజీ తరువాయి...)

భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. వాగులు, ఒర్రెలు, చెరువుల్లో భావులను తవ్వుతూ పంటలకు నీటితడులను అందిస్తున్నారు. అయినా పూర్తి స్థాయిలో నీరందించక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. జిల్లాలో ఫిబ్రవరి చివరి మాసానికి జిల్లా సగటు భూగర్భజలమట్టం 8.5 మీటర్ల లోతులోకి పడిపోయింది. దీంతో ఇచ్చోడ, తలమడుగు, తాంసి, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లో నీటిఎద్దడి సమస్య తలెత్తుతోంది. ఇప్పటికే వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. కాగా, జిల్లాలో ఏడు సమస్యాత్మక మండలాలను గుర్తించారు. ఇందులో 88 గ్రామాలపై అధికారులు ప్రత్యేకదృష్టిని సారిస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాలకు నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ.. ప్రజల దాహాన్ని తీర్చుతున్నారు.

సీజనల్ వ్యాపారాలకు భలే గిరాకీ

వేసవి కాలం నేపథ్యంలో ఎండల తీవ్రత వంటి పరిస్థితులతో సీజనల్ వ్యాపారాలకు మంచి డిమాండ్ ఏర్పడుతోంది. ఇన్నాళ్లు మూలనపడి ఉన్న ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లకు మరమ్మతులు చేయించుకోవడంతో సంబంధిత మెకానిక్‌లకు గిరాకీ పెరుగుతోంది. కొత్తగా తయారు చేసే కూలర్లతో ఎందరో మందికి ఉపాధి కలుగుతోంది. చల్లని సోడా, కర్బుజా, దోసకాయల అమ్మకాలతో చిరు వ్యాపారులకు ఆదాయం వస్తోంది. అలాగే రోడ్లకు ఇరువైపులా శీతల పానియాలు విక్రయించే దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా మట్టి కుండలు, రంజన్‌లకు ఫుల్ గిరాకీ ఏర్పడుతోంది. ఎంతో ప్రాముఖ్యతను కలిగిన మట్టి కుండలు, రంజన్లను ఇతర ప్రాంతాలకు భారీగా తరలిస్తూ కుమ్మరి కులస్తులు ఆదాయం పొందుతున్నారు. ఇలా సీజనల్ వ్యాపారం ఊపందుకోవడంతో చిరు వ్యాపారులకు మంచి ఆదాయం సమకూరుతోంది. సీజనల్ వ్యాపారాలు ఊపందుకుంటున్నా.. ఇతర వ్యాపారాలు మాత్రం పడిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. ఎండల తీవ్రతకు జనం లేకపోవడంతో మార్కెట్ వ్యాపారాలు వెలవెలబోతున్నాయి.

అక్రమంగా నిల్వ ఉంచిన కలప పట్టివేత

బోథ్/ నేరడిగొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బోథ్ రేంజ్ సరిహద్దుల్లోని కుమారి గ్రామంలో బోథ్ రేంజి అధికారి ప్రణయ్ ఆధ్వర్యంలో సోమవారం అక్రమంగా కలప దాచి ఉంచారన్న సమాచారంతో ఇరువురి ఇళ్లపై దాడులు అటవీ శాఖ అధికారులు నిర్వహించారు. దాడులలో రూ.30 వేల విలువైన కలప దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ అధికారులు తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో డీఆర్‌వో అమర్‌సింగ్, ఫారెస్ట్‌సెక్షన్ ఆఫీసర్ నాగోరావ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు విట్టల్, అనిల్, రాదేశం, ధనరాజ్, తదితరులు ఉన్నారు.

గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

నేరడిగొండ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని స్థానికులు పట్టుకున్నారు. సోమవారం అక్రమంగా ఆవు దూడలు, గేదె దూడలను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు సాబ్లే సంతోష్ తెలిపారు. పలువురు యువకులతో కలిసి వాహనాన్ని వెంబడించి శంకరపూర్ గ్రామ సమీపంలో గల రోడ్డుపై అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఆయన తెలిపారు.


బాగా చదవాలి.. ఉన్నతంగా స్థిరపడాలి



చింతల్‌చందాలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ భీమ్‌రావు

లక్ష్మణచాంద, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : యువకులంతా బాగా చదివి ఎదగాలని, ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు సంపాదించి ఉన్నతరంగంలో స్థిరపడాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ జాడే భీమ్‌రావు అన్నారు. తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మాల (టీమ్) ఆధ్వర్యంలో మండలంలోని చింతల్‌చందాలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. భారత రాజ్యాంగం, అంబేడ్కర్ జీవిత చరిత్రలోని ముఖ్యాంశాలు, ఆశయాలు అనే పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధి, ఉద్యోగం కల్పించే కోర్సులు చేయాలన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు కాంతం అడెల్లు మాట్లాడుతూ.. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌తో ఆగిపోకుండా ఉన్నత చదువులు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులకు స్వేచ్ఛ ఇవ్వాలని, ఉపాధ్యాయులు క్రమశిక్షణ కోసం విద్యార్థులను మందలిస్తే తల్లిదండ్రులు వెనకేసుకొని రావద్దన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కాంతం వసంత్ మాట్లాడుతూ... యువకులతో పాటు తల్లిదండ్రులు అన్ని విషయాల్లో అవగాహన కలిగి ఉండాలన్నారు. హైకోర్టు అడ్వకేట్ మట్ట రఘువీర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాంతం మురళి, ప్రముఖ వైద్యులు డాక్టర్ ముఖేష్ నాయకులు తాండ్ర రాజేశ్వర్, నాగభూషణ్, సుంకరి రాజేశ్వర్, రమేష్, రాజేందర్, లక్ష్మణ్, బొర్రన్న, లింగన్న, సుధాకర్, విఘ్నేష్, రాజశేఖర్, ప్రసాద్, గణేష్, బాపయ్య, అశోక్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి



సుంకరి శ్రీనివాస్ మృతదేహం

నర్సాపూర్(జి), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన సుంకరి శ్రీనివాస్(45) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవ శాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రతి రోజులాగే సోమవారం తెల్లవారు జామున బహి ర్భూమికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి ఇంటి నుండి వెళ్లాడు. ఉదయం 9 గంటల వరకు ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు గ్రామ శివారులో గల ఊర చెరువు వద్ద అనుమానం వచ్చి వెతుకగా ఒడ్డుపై శ్రీనివాస్ చెప్పులు కనిపించాయి. వెంటనే గజ ఈతగాళ్లతో చెరువులో వెతుకగా శ్రీనివాస్ చనిపోయి శవమై కనిపించాడు. శ్రీనివాస్ బహిర్భూమికి వెళ్లి చెరువు నీటిలో దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి ఊపిరి ఆడక చనిపోయాడని, అతని భార్య సుంకరి లక్ష్మి నర్సాపూర్(జి) పోలీసుస్టేషన్‌లో దరఖాస్తు ఇవ్వగా ఏఎస్సై శంకర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

జీఐ క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ శిబిరానికి అనూహ్య స్పందన

లక్ష్మణచాంద, మార్చి 17 (ఆంధ్రజ్యోత) : మండలంలోని వడ్యాల్ వాసి, కిమ్స్ ఆసుపత్రి హైదరాబాద్‌లో డా.విమలాకర్‌రెడ్డి పనిచేస్తున్నారు. ఆయన స్థాపించిన టీమ్ విమలాకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనకాపూర్ లోని కేఎస్ ఆర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత జీఐక్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో 300ల మందికి పైగా హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, బీజేపీ నాయకులు వల్లకొండ సత్యనారాయణ గౌడ్‌లు ఈ శిబిరాన్ని సందర్శించి విమలాకర్ రెడ్డిని అభి నందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, నాయకులు నరేష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మేకల రాజేందర్‌యాదవ్, వేణుగౌడ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

తానూర్ తహసీల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌పై దాడి

● నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ● వివరాలు వెల్లడించిన భైంసా ఏఎస్పీ

తానూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని తానూర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న అబ్దుల్ వకీల్‌పై సోమవారం దాడి జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలను భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్.. తానూర్ పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. తానూర్ తహసీల్దార్ కార్యాలయంలో వకీల్ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం భైంసా ఆర్డీవో కార్యాలయం నుంచి తానూర్ కార్యాలయానికి రికార్డులను తీసుకొస్తున్నాడు. కాషాయం రంగు గల వస్త్రంలో రికార్డులను కట్టుకొని తన స్కూటీపై కాళ్లు పెట్టే మధ్య భాగంలో పెట్టుకొని తానూర్‌కు వస్తున్నాడు. మార్గమధ్యలో తానూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఈ విషయాన్ని గమనించి.. గ్రామ యువకులకు ఫోన్ చేసి విషయాన్ని తెలిపాడు. దీంతో భోరిగాం గ్రామ సమీపంలో వారు వకీల్‌ను ఆపి కాషాయ వస్త్రంపై కాళ్లు ఎందుకు పెట్టావంటూ.. అతనిపై దాడికి పాల్పడినట్టు ఏఎస్పీ తెలిపారు. సీసీ పుటేజీలను పరిశీలించి, పుటేజీల ఆధారంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. మరికొందరు నిందితుల కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్పీ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో ముథోల్ సీఐ మల్లేష్ పాల్గొన్నారు.



నిర్మల్ జిల్లా తానూరులో విలేకరులతో మాట్లాడుతున్న భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్

● గాయపడ్డ ఉద్యోగిని పరామర్శించిన ఆర్డీవో

భైంసా, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : భోరిగాం గ్రామం వద్ద యువకుల దాడిలో గాయపడ్డ అబ్దుల్ వకీల్‌ను భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి పరామర్శించారు.

భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన వద్దకు ఆర్డీవో వెళ్లి.. దాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో కోమల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగులపై దాడులకు పాల్పడటం సమంజసం కాదన్నారు. అబ్దుల్ వకీల్‌పై జరిగిన దాడి ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. దాడికి పాల్పడ్డ దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అందరూ శాంతి, సంయమనాలతో వ్యవహరించాలని ఆర్డీవో సూచించారు.

విద్యార్థిని ఆత్మహత్యపై హోరెత్తిన ఆందోళనలు



ప్రధాన రోడ్డుపై భైఠాయించిన అరె మరాఠ శ్రేణులు

● ప్రధాన రోడ్డుపై అరె మరాఠా కులస్థుల రాస్తారోకో
● ఘటనకు కారకుడైన యువకుడిని అరెస్టు చేయాలని డిమాండ్
● ఏఎస్పీ అవినాష్ కుమార్ చొరవతో శాంతించిన ఆందోళనకారులు

భైంసా, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వేధింపులతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని కదం కోమల్ (14) ఘటనను నిరసిస్తూ సోమవారం భైంసాలో ఆందోళనలు హోరెత్తాయి. మృత విద్యార్థిని కుటుంబీకులు, బంధువులు, అరే మరాఠ శ్రేణులు సంబంధిత ఘటనకు కారకుడైన యువకుడిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగారు. ఆదివారం రాత్రి వేళలో విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇక్కడి ఏరియా ఆసుపత్రిలోని మార్చురీ తరలించారు. సోమవారం ఉదయం వేళలో ఏరియా ఆసుపత్రికి తరలి వచ్చిన మృత విద్యార్థిని కదం కోమల్ కుటుంబీకులు తమ కాలనీ పరిధిలోని యువకుడి ప్రేమ వేధింపులు భరించలేకే ఆత్మహత్య ఘటన చోటు చేసుకుందని, సదరు యువకుడిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఆసుపత్రికి చేరుకున్న భైంసా పట్టణ అరే మరాఠ శ్రేణులు, మృత విద్యార్థిని బంధువులు సైతం బాధిత కుటుంబానికి మద్దతుగా ఆందోళనలు చేపట్టారు. ఆసుపత్రి నుంచి బస్టాండ్ రోడ్డు మార్గానికి తరలివచ్చి ప్రధాన రోడ్డుపై భైఠాయించి రాస్తారోకో దిగారు. వాహనాల రాకపోకలను అడ్డుకొని ట్రాఫిక్ వ్యవస్థను పూర్తి స్థాయిలో స్తంభింప చేశారు. యువకుడిని అరెస్టు చేసేంత వరకు తాము ఇక్కడి నుంచి కదలబోమని, ఆందోళనలను విరమించబోమని తేల్చి చెప్పారు. భైంసా రూరల్ సీఐ నైలు, టౌన్ ఎస్ఐలు శ్రీనివాస్ యాదవ్, గౌస్‌లు ఆందోళనకారులను సముదాయించేందుకు విఫలయత్నం చేశారు.ఇంతకింతకి ఆందోళనకారులు సంఖ్య పెరుగుతుండటంతో పాటు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు ఆర్‌టీసీ బస్సులను బస్టాండ్ మార్గం వైపు రానీయకుండా నిర్మల్ క్రాస్ రోడ్డు మీదుగా దారి మళ్లింపులు చేపట్టారు. లోపలి వైపు నుంచి వచ్చిన వాహనాలను నర్సింహనగర్, పాత సినిమా థియేటర్ రోడ్డు వైపు మళ్లింపులు చేపట్టారు. సంబంధిత సమాచారం అందుకున్న భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఘటన స్థలికి చేరుకొని మృత విద్యార్థిని కుటుంబీకులు, ఆందోళనకారులతో మాట్లాడారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసు నమోదు చేసామని వెల్లడించారు. ఇందుకు మృత విద్యార్థిని కుటుంబీకులతో పాటు అరే మరాఠ శ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యువకుడి వేధింపుల కారణంగానే ఘటన జరిగిందని, ఇందుకు కారకుడైన సదరు యువకుడిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన ఏఎస్పీ అవినాష్ కుమార్ పూర్తి వివరాలను అందిస్తే అందుకు అనుగుణంగా కేసు నమోదు చేసి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముందుగా ఆందోళనలను విరమించి పోలీసుశాఖకు సహకరించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆందోళనకారులు శాంతించి ఆందోళనలు విరమించారు.

● మిన్నంటిన రోదనలు

కదం కోమల్ ఆత్మహత్య ఘటనతో భైంసాలోని ఫులేనగర్ కాలనీ పరిధిలో విషాదచాయలు అలుముకున్నాయి. విద్యార్థిని మృతదేహం వద్ద కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. విద్యార్థిని తల్లి,చెల్లి మృతదేహం పై రోదించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది.

లింబా (కే) గ్రామంలో కార్డన్‌సెర్చ్

కుంటాల, మార్చి, 17 : (ఆంధ్రజ్యోతి) : నేరాల అదుపునకే గ్రామాలలో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. లింబా (కే) గ్రామంలో సోమవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నైలు, ఎస్సైలు రవీందర్, భాస్కరాచారి, ఇద్దరు ఏఎస్సైలు మరో 15 మంది పోలీసు సిబ్బందితో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమాచార హక్కు చట్టం అమలయ్యేలా చూడాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో సమాచార హక్కు చట్టం 2005 అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలయ్యేలా చూడాలని కోరుతూ సోమవారం అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్‌కుమార్‌కు సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, చట్టానికి లోబడి అధికారులు పని చేసేలా చూడాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి సుభాష్, జిల్లా అధ్యక్షుడు సిహెచ్. వినోద్ కుమార్, అబ్దుల్ సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు నాలుగు గ్రూపులుగా చట్టబద్ధత కల్పించాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ఎస్సీ వర్గీకరణ బిల్లు గ్రూపులుగా చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. సోమవారం ఎంఎస్పీతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ... 59 షెడ్యూల్ కులాలకు సామాజిక న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన వారిని నాలుగు గ్రూపులుగా చేర్చించి చట్టబద్ధత కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పీ కోఆర్డినేటర్ శనిగారపు రవి, నాయకులు బాబు, అరుణ్, దశరథ్, భూమేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘ ప్రధాన కార్యదర్శిగా అశోక్

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణ మాదిగల అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శిగా అడ్డిగ అశోక్ నియమితులయ్యారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన అశోక్‌ను నియమిస్తున్నట్టు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నిగులపు లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యమంలో పాల్గొనాలని సూచించారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గుల్జార్ మార్కెట్ 39వ వార్డులో లో ఓల్టేజ్ సమస్య పరిష్కరించాలని మాజీ కౌన్సిలర్ తౌహీద్‌ఉద్దీన్ కోరారు. సోమవారం ఏడీ రామకృష్ణను కలిసి రంజాన్ నెల కావడంతో లో ఓల్టేజ్ సమస్య ఎదుర్కొంటున్నామని వివరించారు.

అటవీ అధికారులపై చర్య తీసుకోవాలి : న్యూ డెమోక్రసీ

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండలం రంగంపేట కొత్తగూడెంలో నివాసముంటున్న గోనె స్వామి, కూతురు మల్లేశ్వరి ఇళ్లను కూల్చివేసిన అటవీ అధికారులపై చర్య తీసుకోవాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. అక్కడ 40 కుటుంబాలు భూ పోరాటాలు చేసి స్థలాలు సాధించుకున్నారని జిల్లా కార్యదర్శి జే. రాజు అన్నారు. బాధితులకు ఇందిరమ్మ పథకం ఇళ్ల నిర్మాణానికి 2008లో రూ. 12 వేలు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాంటి ఇంటిని ఇటీవల నోటీసులు ఇచ్చి అధికారులు అక్రమంగా కూల్చివేశారని ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. రాజేష్, వెంకటేష్, డి. లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

సారంగాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కొత్తపల్లి విలాస్‌రావు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావుతో పాటు నాయకులు పరామర్శించారు.

విద్యార్థులకు కేఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెన్నుల పంపిణీ

సారంగాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి(బి), ధని, ఆలూర్ గ్రామాల్లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం కేఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెన్నులతో పాటు బుక్స్‌ను, పోటీ పరీక్షల సామాగ్రిని ట్రస్ట్ చైర్మన్ నవీన్ రెడ్డి పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బి. నర్సయ్య, నాయకులు నారాయణరెడ్డి, శ్రీకాంత్, లింగారెడ్డి, చిన్నయ్య, సాయన్నలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు వివేకానంద రెడ్డి, రమేష్‌లతో పాటు విద్యార్థులు ఉన్నారు.

ఫటా..ఫట్...

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

● రాజుల దేవి విజయ్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారి, కుభీర్



పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 24వ తేది నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

ప్రశ్న: మండలంలో పరీక్ష కేంద్రాలెన్ని ఎన్ని పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

జవాబు: మండల కేంద్రంలో ఒకే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశాము. ఈ పరీక్ష కేంద్రంలో కుభీర్, పల్సి, కుభీర్ ఉర్దూమీడియం, పార్డి(బి), మాలేగాం, ప్రభుత్వ పాఠశాలల డొడర్న, కస్తూర్బా గాంధీ, బాలికల విద్యాలయం, ఒక ప్రయివేటు పాఠశాల విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు.

ప్రశ్న: పరీక్షలకు ఎంతమంతి విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష ల నిర్వాహణ కోసం ఎంత మంది అధికారులను ఏర్పాటు చేశారు.

జవాబు: పది పరీక్షల్లో ఏడు ప్రభుత్వ, ఒక ప్రైవేటు పాఠశాలలకు చెందిన 269 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. నిర్వాహణ కోసం 15 మంది ఇన్విజిలేటర్లు ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని ఏర్పాటు చేశాము.

ప్రశ్న: హాజరవుతున్న విద్యార్థులకు ఎలాంటి వసతులు కల్పించారు.

జవాబు: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. తాగు నీరు ఫ్యాన్లు విద్యుత్ సౌకర్యం, సరిపడ బెంచీలు, మరుగుదొడ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాము.

ప్రశ్న: విద్యార్థులు మాస్ కాపికి పాల్పడకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాము. ఫ్లయింగ్ , సిట్టింగ్ స్క్వాడ్స్ తనిఖీ నిర్వహిస్తారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

● (ఆంధ్రజ్యోతి, కుభీర్)

పడకేసిన పారిశుధ్యం

● దారులన్నీ దుర్గంధం ● కొత్త పంచాయతీలో పాత సమస్యలే ● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

తలమడుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలో పారిశుధ్యం లోపించి వ్యాధుల ప్రబలుతున్న పట్టించుకోని అధికారులు కరువు అయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పాలన సౌలభ్యం కోసం కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో పాత సమస్యలే రాజ్యమేలుతు న్నాయి. దీంతో గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ పంచాయతీలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించినప్పటికీ సంబంధిత ప్రత్యేక అధికారులు చుట్టం చూపుల వచ్చి వెళ్తున్నారు. తప్ప గ్రామాల వైపు కన్నెతి చూడడం లేదని సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుం డా గ్రామ పంచాయతీ సెక్రటరీలు గ్రామాలను పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్లన్నీ మురికి కాలువలతో నిండి దుర్గంధమైన వాసన వస్తున్న వాటిని శుభ్రం చేయడం లేదన్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో గల కొత్తగా ఏర్పడిన డోర్లి గ్రామ పంచాయతీలో పారిశుధ్యం లోపించి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. కొన్ని నెలల నుంచి మురికి కాలువలను శుభ్రపరచడం లేదన్నారు. అంతేకాకుండా రోడ్లపైనే చెత్త చెదారం మల మూత్ర విసర్జన చేయడంతో రోడ్లపై నడవాలి అంటేనే ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ విషయమై మండల స్థాయి అధికారులకు విన్న వించినా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. అంతేకాకుండా పేరుకు పోయిన మురికి కాలువలను. శుభ్రపరచాలని విన్నవించిన ఎవరు స్పందించడం లేదన్నారు. అంతేకాకుండా రాత్రిపూట వీధి దీపాలు సైతం సక్రమంగా వెలగడం లేదన్నారు. చీకటిలోనే ఉండవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. చుట్టూ వ్యవసాయ పొలాలు ఉండడంతో రాత్రి పూట గ్రామాల్లోకి అడవి పందులు, గతంలో చిరుత పులి సంచరించాయని గ్రామస్థులు తెలిపారు. చిరుత పులి గ్రామాల్లోకి రాకుండా వారం పది రోజులు తిరిగామని, ఈ సందర్భంగా గ్రామస్తులు పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి డోర్లి గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను. పరిష్కరించి గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



డోర్లి గ్రామ పంచాయతీలో చెత్తాచెదారంగా మారిన రోడ్డు

జర దేఖో!!



డోర్లిలో పేరుకుపోయిన మురుగు కాల్వలు



రహదారి పక్కనే చెత్త ఇలా..

ప్రమాదకరంగా రహదారి

● రహదారి విస్తరణ పనుల్లో జాప్యం ● కంకర దారిపై అదుపు తప్పుతున్న వాహనాలు ● గాయాలపాలవుతున్న వాహనదారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన



ఇచ్చోడ శివాజీ చౌరస్తాలో ప్రమాదకరంగా మారిన కంకర దారి



రహదారిపై వాహనాలు ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం

ఇచ్చోడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ పట్టణం లోపలి నంచి ప్రయాణం అంటేనే తలలు పట్టుకుంటున్నారు వాహనదారులు. రోడ్డుపై వేసిన కంకరలో పదే పదే వాహనాలు ఇరుక్కుపోతుండడంతో ఇచ్చోడ నుంచి ప్రమాణించడానికి ప్రజలు జంకుతున్నారు. రోడ్డు విస్తరణ పనుల గడువు ముగింపు దశకు వచ్చిన ఇంకా విస్తరణ పనులు పూర్తికాకపోవడంతో ఇంకెప్పుడు పూర్తవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇచ్చోడలోని ప్రధాన రహదారి ఆదిలాబాద్ బైపాస్ రోడ్డు నుంచి నిర్మల్ బైపాస్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు ఏమో గానీ వాహనదారులు మాత్రం బెంబేలెత్తుతున్నారు. ఇచ్చోడ ప్రధాన రహదారిపై కంకర వేసి చదును చేసి వదిలేయడంతో ద్విచక్ర వాహనాలు జారిపడుతున్నాయి. కార్లు, లారీలు కంకరలో కూరుకుపోతున్నాయి. ఇలా ద్విచక్ర వాహనదారులు జారిపడుతుండడంతో చిన్న పాటి గాయాలు తగులుతున్నాయి. కార్లు, ఆటోలు ఇరుక్కుపోవడంతో వాహనాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని వాహనదారులు వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. పనులు నామమాత్రంగా సాగుతుండడంతో ప్రజలు ఈ దారిగుండా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అత్యవసరముంటేనే ఇంట్లో నుంచి బయటకు వస్తున్నారే తప్ప రోడ్డుపైకి వచ్చే సాహసం చేయడం లేదు. రోడ్డు పనులు సాగుతున్నాయే.. తప్ప ఏ ఒక్క అధికారి ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖాలలు కనిపించడంలేదు. ఇకనైనా అధి కారులు వెంటనే సమస్యను పరిష్కరిం చాలని కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు విస్త రణ పనులను వేగవంతం చేసి వాహన దారుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ పనులతో అవస్థలు

రోడ్డు విస్తరణ పనులు పూర్తికాకపోవడంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుకాణ సముదయాల ముందు మొరం కుప్పలు, కంకర అలాగే వదిలేస్తే ఏలా అని స్థానికులు వాపోతన్నారు. దుకాణాల ముందు అడ్డదిడ్డంగా కుప్పలు ఉండడంతో వ్యాపారాలు సైతం నడవట్లేదని వ్యాపారులు వారి ఆవేదనను వెల్లబుచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా చిరు వ్యాపారాలు చేసుకునే వారు రోజుకో ప్రాంతంలో దుకాణాన్ని ఉంచడంతో చిరు వ్యాపారుల వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. అధికారులు సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది.



సుంకిడి పాఠశాల 10వ తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాఠశాలను విడిచి వెళుతున్నందుకు

కంటతడి పెట్టిన విద్యార్థులు

● సుంకిడి పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం

తలమడుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చదువులమ్మ తల్లిలో పెరిగి విడిపోతున్నందుకు బాధగా ఉందని పాఠశాల విద్యార్థులు కంటతడి పెట్టి ఘనంగా వేడుకలు సమావేశం నిర్వహించారు. సోమవారం తలమడుగు మండలంలోని సుంకిడి ఉన్నత పాఠశాల లో 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమా వేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి అధ్యక్షత వహించగా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థుల సమయాన్ని వృధా చేయకుండా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. ఎక్కడికి వెళ్ళినా పాఠశాలను ఉపాధ్యాయులను, గ్రామస్థులు మర్చిపోవద్దని సూచించారు. అనంతరం సబ్జెక్టు టీచర్స్ విద్యార్థులకి మార్గదర్శనం చేశారు. ఆ తరువాత విద్యార్థిని విద్యార్థులు ఆట పాటలతో డీజే డాన్సులతో హోరెత్తించారు. అందరూ మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులమైతామని పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకొస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. గజానన్, వై.రామ్ రెడ్డి, సుకుమార్ పెట్కులే, ఆర్. సుజాత, సి.శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, పి.డి నాందేవ్, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్గాంకు ఉపాధ్యాయుడిని ఇవ్వండి

● డీఈవోను ఆదేశించిన జిల్లా కలెక్టర్
● కలెక్టర్‌కు ఆంధ్రజ్యోతి కథనాలు చూపించిన కపిల్
● ఆంధ్రజ్యోతి కథనాన్ని పరిశీలించిన కలెక్టర్



కలెక్టర్‌కు ఆంధ్రజ్యోతి కథనాలు చూపిస్తున్న బక్కి కపిల్ యాదవ్

భీంపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అంతర్గం పాఠశాలలో 77 మంది విద్యార్థులకు గాను ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారని, ఇదే మండలం కామట్‌వాడ పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారని ఈ నెల 9న అంతర్గం పాఠశాలలో ఉపాధ్యాయులు కొరత అలాగే ఈనెల 12న తరగతులు ఐదు విద్యార్థులు 11 అనే కథనాలు ఆంధ్రజ్యోతిలో వచ్చిన విషయం తెలిసిందే. ఆంధ్రజ్యోతి కథనాలు జత చేస్తూ అంతర్గం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బక్కి కపిల్ యాదవ్ సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందించారు. ఆంధ్రజ్యోతి పూర్తి కథనాలు చదివిన కలెక్టర్ డీఈవో ప్రణీతను పిలిచి ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశిం చారు. త్వరలో అంతర్గం బడికి మరో ఉపాధ్యాయుడిని కేటాయించడేలా చూస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ మాట ఇచ్చారు. ఈ కథనంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

బడిలో కూరగాయల సాగు బహు బాగు

● జీసీడీవో మెస్రం ఛాయ



కూరగాయలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

నేరడిగొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బడిలో కూరగాయల సాగు భలే బాగుందని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. సోమవారం మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. మా బడి మాతోట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల ఆకు కూరలు, కూరగాయలు పండిస్తున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తూ ఆ పాఠశాల ఆవరణలో ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. ఈ ఆకుకూరలు, కూరగాయలను మధ్యాహ్న భోజనంతో వినియోగిస్తున్నారు. కూరగాయలను సేకరించారు. ఈ సందర్భంగా జీసీడీవో మెస్రం ఛాయా ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులను అభినందించారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులపై ప్రత్యేక స్కిల్స్ సారించాలన్నారు. పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు గుగ్లోత్ అంబారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

● నిర్మల్ జిల్లాలో 47 పరీక్షా కేంద్రాలు ● 9,129 మంది విద్యార్థులు ● 523 మంది ఇన్విజిలేటర్లు



ముథోల్‌లోని ఓ పరీక్షా కేంద్రం

ముథోల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్మల్ జిల్లా విద్యాధికారి రామారావు తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి వచ్చే ఏప్రిల్ 4వ తేదీ వరకు జిల్లాలో 47 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలు నిర్వహించబడుతాయని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల పకడ్బందీ నిర్వహణకు గాను ప్రతీ పరీక్షా కేంద్రానికి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు అంటే ఎలాంటి భయం లేకుండా రాసే విధంగా సన్నద్ధం చేశామన్నారు. జిల్లాలోని 9,129 మంది పదవ తరగతి విద్యార్థులను గాను 47 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేపట్టినట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 47 మంది చీఫ్ సూపరిండెంట్‌లు, 47 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 47 సిట్టింగ్స్ స్క్వాడ్, 523 మంది ఇన్విజిలేటర్లు, 3 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు విధులు నిర్వహిస్తారన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్న పత్రాలు తెరవనున్నామన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఎవరికిసెల్ ఫోన్లు అనుమతి లేదన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకరావద్దన్నారు. సీఎస్, డీవోలు, సిట్టింగ్స్ స్క్వాడ్స్, రూట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, తదితర సిబ్బందితో పాటు పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయి పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష సమయాల్లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షా కేంద్రాలు, మండల ప్రధాన కార్యాలయాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలను మూసి వేయడంతో పాటు పరీక్షా కేంద్రానికి 200ల మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మందులతో వైద్య బృందాలను ఏర్పాటుతో పాటు పోలీస్ సిబ్బంది ఉంటుందన్నారు. పరీక్ష సమయాల్లో అన్ని పరీక్షా కేంద్రాలకు అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా, విద్యార్థులకు త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లతో పాటు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి పుకార్లు నమ్మకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు.

ఐక్యతకు మారుపేరు మేడిగూడ

● పలు సామూహిక కార్యక్రమాలతో విశిష్టత చాటుతున్న గ్రామం



వివాహానికి ఆర్థికసాయం అందజేస్తున్న మహిళలు

ఇచ్చోడ, మార్చి, 17 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గ్రామం ఆచారాలకు నిలయం. తమ సంస్కృతిని కాపాడుతూనే.. సహాయ గుణాన్ని చూపుతున్నారు. గ్రామస్థులు పలు సామూహిక కార్యక్రమాలతో, సహాయ కార్యక్రమాలతో విశిష్టత చాటుతున్న ఆదివాసీ గ్రామం మేడిగూడ. ఇచ్చోడ మండలంలోని ఆదివాసీ గ్రామమైన మేడిగూడ గ్రామం ఐక్యతకు మారుపేరుగా నిలుస్తోంది. గ్రామంలో పెద్దలు నిశ్చయించిన వివాహానికి అవసరమయ్యే సొమ్మును ఆ గ్రామమంతా కలిసి రూ.25వేలను పెళ్లి ఖర్చుల కోసం ఆ కుటుంబానికి ఆర్థిక సాయంగా అందించారు. మహిళలంతా కలిసి ఈ సొమ్మును పోగుచేసి అందించడంతో కుటుంబానికి అండగా నిలిచారు. దీంతో ఆ గ్రామ మహిళలను అభినందిస్తున్నారు.

బాసర నది తీరం.. వసతులు ఘోరం!

● నిర్వహణ లోపంతో అపరిశుభ్రంగా స్నాన ఘట్టాలు, పరిసరాలు
● అసౌకర్యంగా తాత్కాలిక షెడ్లు ● సరిగ్గా తాగునీరు దొరకని పరిస్థితి

ఫొటో న్యూస్



తాగునీటి కుళాయిల వద్ద అపరిశుభ్ర వాతావరణం



స్నానఘట్టం వద్ద పేరుకపోయిన చెత్తాచెదారం



స్నానఘట్టం వద్ద ప్రధాన రహదారిపైనే వాహనాల పార్కింగ్



భక్తులకు అనువుగా లేని బట్టలు మార్చుకునే తాత్కాలిక పందిళ్లు

బాసర, మార్చి, 17 : (ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి తీరంలో భక్తులకు సౌకర్యాలు కరువవుతున్నాయి. నిత్యం వేలాది మంది యాత్రికులు సందర్శించే నది వద్ద మౌలిక వసతులను కల్పించడం లేదు కనీసం పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉండడం లేదు. స్నాన ఘట్టాల చుట్టూ, నది నీటిలో, మెట్లపై పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. చెత్తాచెదా రంతో దర్శనమిస్తున్నాయి. అపరి శుభ్ర వాతావరణంలోనే భక్తులు నదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. మరో పక్క మౌలిక వస టతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. కనీసం తాగు నీరు దొరకని పరిస్థితి. అక్కడ ఆర్వో ప్లాంట్ ఉన్నప్పటికి ఎప్పుడు నీరు వస్తుందో తెలియదు. దాహం తీర్చుకోవాలంటే భక్తులు నీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి ఉంది. బట్టలు మార్చు కునేందుకు గది ఒక్కటే ఉండడంతో మహిళలకు సరిపోవడం లేదు. గది లోపల నిర్వహణ లేక అపరిశుభ్రంగా తయారైంది. మెట్లపై తడకలతో పందిళ్ల ఏర్పాటు చేసినప్పటికి మహిళలు బట్టలు మార్చుకు నేంత అనువుగా లేవు. రేకుల షెడ్లు వంటివి ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. అదే విధంగా స్నాన ఘట్టం వద్ద వాహనా ల పార్కింగ్ రోడ్డుపైనే నిలిపిఉంచడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా దేవస్థాన అధికారుల నిర్లక్ష్యం మూలంగా భక్తులకు కనీస అవసరాలకు వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.





కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామంలో నర్సరీల్లో పెంచుతున్న ఔషధ మొక్కలు

ఇంటింటా మొక్కల పెంపకం



- ఔషధ మొక్కల పెంపునకు ప్రాధాన్యం
- జిల్లాలోని గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు
- వన మహోత్సవంలో కార్యాచరణ అమలు

నిర్మల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వన మహోత్సవం కార్యక్రమం సందర్భంగా డొమెస్టిక్ ప్లాంటేషన్ పేరిట ఇంటింటా మొక్కల పెంపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందులో భాగంగానే హార్టికల్చర్‌శాఖ, డీఆర్డీఏలు ఉమ్మడిగా జిల్లావ్యాప్తంగా ఈ కార్యాచరణను అమలు చేయబోతున్నాయి. ఇప్పటికే డీఆర్డీఏ ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగుచోట్ల ఔషధ మొక్కలకు సంబంధించిన నర్సరీలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు నివాసగృహాల సముదాయాలలో పూల మొక్కలను అలాగే అలంకరణ మొక్కల పెంపకాన్ని విస్తృతంగా చేపడుతున్నారు. అయితే ఇక నుంచి ఈ మొక్కల పెంపకాన్ని తగ్గిస్తూ ఔషధమొక్కల పెంపకాన్ని మరింత ప్రోత్సాహించాలని భావిస్తున్నారు. దీని కోసం ఇంటింటా విస్తృతంగా ప్రచారాన్ని చేపట్టబోతున్నారు. ఔషధమొక్కల ప్రాధాన్యతను వివరించేందుకు గ్రామాలు వార్డుల వారీగా అవగాహన సదస్సును కూడా నిర్వహించబోతున్నారు. ఇప్పటికే నాలుగు నర్సరీల్లో పెంచుతున్న ఔషధ మొక్కలను ప్రతి ఇంటిని పంపిణీ చేసేందు కోసం సైతం కార్యాచరణ రూపొందిస్తున్నారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఇప్పటికే కొండాపూర్ గ్రామం వద్ద ఉన్న సమీకృత వ్యవసాయ క్షేత్రంలో పలు ఔషధ మొక్కలకు సంబంధించి నర్సరీలను నిర్వహిస్తున్నారు. అలాగే జిల్లాలోని కడ్తాల్, రత్నాపూర్ కాండ్లి, కడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పలు రకాల ఔషధమొక్కలను పెంచుతున్నారు. ఈ నాలుగు గ్రామాలను ఫైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఇక్కడి నర్సరీల్లో మరిన్ని ఔషధ మొక్కల ప్లాంటేషన్‌ను చేపట్టాలని నిర్ణయించారు. ఇక్కడి నుంచే వన మహోత్సవం సందర్భంగా అన్ని గ్రామాలకు ఔషద మొక్కలను పంపిణీ చేసేందుకు సైతం కార్యచరణ రూపొందించారు.

ఫైలెట్ ప్రాజెక్టుగా నాలుగు గ్రామాలు

కాగా డొమెస్టిక్ ప్లాంటేషన్ కార్యాచరణలో భాగంగా ఔషధమొక్కలతో పాటు ఫ్యాషన్ ఫ్రూట్ మొక్కల నర్సరీలను విస్తృతస్థాయిలో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా మొదట నాలుగు గ్రామాలను ఫైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఆ గ్రామాల్లో నర్సరీల పరిధిని పెంచనున్నారు. ఈ నాలుగు గ్రామాలను ఫెలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి మొదట ఇక్కడి నుంచే డొమెస్టిక్ ప్లాంటేషన్ కార్యచరణను అమలు చేయతలపెట్టారు. అనం తరం మరిన్ని గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి ఈ నర్సరీల నుంచి గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో విస్తృతంగా ఇంటిం టికి ఔషధమొక్కలను పంపిణీ చేయనున్నారు. కాగా ఔషద మొక్కల పెంపుదలను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు గ్రామస్థాయిలో మహిళ పొదుపు సంఘాలతో పాటు స్థానిక సంస్థల ఉద్యోగులతో కలిపి ఓ బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ బృందం సభ్యులు నెల రోజులకు ఒకసారి ఇళ్లల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించనున్నారు. అలాగే మొక్కల పెంపునకు అవసరమైన సలహాలు, సూచనలు కూడా అందిం చనున్నారు.

ఇక అలంకరణ మొక్కలకు ప్రాధాన్యత తగ్గింపు

ఇప్పటి వరకు హోం ప్లాంట్స్‌లో ఎక్కువగా పూలమొక్కలు, అలంకరణ మొక్కలకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇక నుంచి వీటిని ఔషధ మొక్కలైన కలబంధ, అశ్వగంధ, కరివేపాకు, నిమ్మ, దానిమ్మ లాంటి మొక్కలను పెంచేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన నాలుగు నర్సరీల్లో ఈ మొక్కలను కూడా పెంచుతున్నారు. తక్కువ స్థలం, తక్కువ సమయంలో ఈ మొక్కలు పెరగనున్నందున వన మహోత్సవం లక్ష్యం కూడా నెరవేరే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ ఔషద మొక్కలను హోమ్‌ప్లాంట్స్ పేరిట ఇంటింటికి పంపిణీ చేసే బాధ్యతలను ఇటు గ్రామీణ అభివృద్ధి శాఖకు అటు హార్టికల్చర్ శాఖతో పాటు పంచాయతీ, మున్సిపాలిటీలకు కూడా అప్పజెప్పనున్నారు.

ఫ్యాషన్‌ఫ్రూట్ మొక్కల పెంపునకు ప్రోత్సాహం

అనేక ఔషద గుణాలతో పాటు పలు రకాల విటమిన్‌లు కలిగి ఉండే ఫ్యాషన్ ఫ్రూట్ మొక్కల పెంపకానికి ఈ సారి అత్యధిక హోమ్ ప్లాంట్స్ పేరిట ప్రాధాన్యతనివ్వనున్నారు. సాధారణ మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తూనే ఔషద మొక్కల పెంపకంపై అవగాహన పెంపొందించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నారు. ఫ్యాషన్ మొక్కలను కొమ్మ కత్తిరింపు విధానంతో నర్సరీల్లో పెంచుతున్నారు. ఇప్పటి వరకు దాదాపు 2000 మొక్కలకు పైగా ప్లాంటేషన్‌కు సిద్దంగా ఉన్నాయి. ఫ్యాషన్ ఫ్రూట్ పుష్కలమైన ఔషధ విలువలు కలిగి ఉన్నట్లు సంబందిత అధికారులు పేర్కొంటున్నారు. సీ విటమిన్, కాల్షియం, పోటాషియం, కె, డీ, బీ విటమిన్‌లు సైతం ఈ ఫ్రూట్‌లో పుష్కలంగా ఉంటాయి. ఈ ఫ్యాషన్ ఫ్రూట్ తినే వారికి దీర్ఘకాలిక వ్యాధులు అలాగే ప్రమాదకరమైన క్యాన్సర్ లాంటి వ్యాధులు సైతం ధరిచేరవని చెబుతున్నారు. ఈ ఫ్రూట్‌ను తినే వారికి వ్యాధి నిరోధక శక్తి కూడా విపరీతంగా పెరుగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



కొండాపూర్ గ్రామ సమీకృత వ్యవసాయ క్షేత్రంలో ఔషధ మొక్కలు పెంచుతున్న దృశ్యం

జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- సోమవారం 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఖానాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమేపి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. వాతావరణంలో మార్పు చోటుచేసుకుని క్రమేపి ఉక్కపోత పెరుగుతోంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటల సమయం దాటిందంటే చాలు ఎండ తీవ్రత పెరిగిపోతోంది. మార్చిలోనే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మే మాసాల్లో ఇంకా ఎండల తీవ్రత ఎంత ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. నిర్మల్ జిల్లాలో సోమవారం 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చెబుతున్నారు.

బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండండి : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని యువత, విద్యార్థులు బెట్టింగ్ యాప్‌లకు ఆన్‌లైన్ గేమింగ్‌లకు అలవాటు పడి జీవితాలు కోల్పోవద్దని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో అక్రమ బెట్టింగ్ యాప్స్ గేమింగ్‌యాప్‌లకు అలవాటు పడవద్దని, సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడవద్దని హితవు పలికారు. గేమ్స్‌ను ప్రోత్సహించిన వ్యక్తుల పైన చట్టరీత్యా చర్యలుంటాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ గేమింగ్ కట్టడికి పోలీసుశాఖ ఆధునిక సాంకేతిక వినియోగించుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

మానవ అక్రమ రవాణా నిషేధంపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రూరల్ ఎస్సై లింబాద్రి

నిర్మల్ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సంఘాల అధ్యక్షురాలు, వీవోఏలకు మానవ అక్రమ రవాణా నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ విషయాన్ని జిల్లా అదనపు డీఆర్డీవో జ్ఞాను తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై లింబాద్రి, సఖి సెంటర్ నిర్వాహకురాలు శ్వేత రాణి, మహిళా సాధికారత అధికారులు మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలంటే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మెప్మా పీడీ సుభాష్ అన్నారు. సోమవారం ఈడీఐఐ ఆధ్వర్యంలో చేతితో నగలు తయారు చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. యాక్సెంచర్, ఈడీఐఐ ఆధ్వర్యంలో బోయవాడ, బంగల్‌పేట్‌లో 26 రోజుల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మహిళలు అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచంచారు. మెప్మా రిసోర్స్ పర్సన్ సంధ్య, మాస్టర్ ట్రైనీ అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో రైతు మృతి



గణేష్ మృతదేహం

కుభీర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్పెల్లి(హెచ్) గ్రామానికి చెందిన పబ్బు గణేష్(48) అనే రైతు సోమవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం మృతుడికి 12ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో రెండెకరాలలో మొక్కజొన్న సాగుచేస్తున్నాడు. సోమవారం ఉదయం జొన్నపంటకు నీరు పెట్టేందుకు చేన్లోకి వెళ్లి మోటరుస్టార్ట్ చేసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురయి అక్కడిక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రాకపోయే సరికి తన కుమారుడు పబ్బు సంజయ్ చేల్లోకి వెళ్లి చూసి తండ్రి విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతునికి భార్య, కూతురు , కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసా రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం గ్రామానికి చెందిన బి. సాయినాథ్(50) ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాయినాథ్ గత కొన్ని రోజులుగా కడుపు నొప్పి, పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మానసికంగా తనలో తానే బాధపడుతూ ఉండేవాడు. ఆసుపత్రుల్లో చూపించుకున్న తగ్గకపోవడంతో జీవితంపై విరక్త చెంది రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి కుటుంబ సభ్యులు పడుకున్న తరువాత దేగాం గ్రామంలో గల పద్మశాలి సంఘం భవనం స్లాబ్‌కి నైలాన్ తాడుతో ఉరి వేసుకొని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చూసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

నసీరాబాద్ వద్ద రోడ్డు ప్రమాదం

ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు

నర్సాపూర్(జి), మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నసీరాబాద్ గ్రామం వద్ద సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నందన్ గ్రామానికి చెందిన కూన కళ్యాణ్ తన ద్విచక్ర వాహనంపై నిర్మల్ నుండి నందన్ వస్తుండగా నసీరాబాద్ వద్ద లారీని ఓవర్టేక్ చేసి నర్సాపూర్ నుంచి రాంపూర్ వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న రాంపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వెంకట రమణ, నాగార్జునకు కాళ్లు విరిగిపోయాయి. మరొకరు రైస్‌మిల్లులో పని చేస్తున్న కూలీ తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. నందన్ గ్రామానికి చెందిన కూన కళ్యాణ్ కుడి కాలు ఎముక విరిగి బయటపడ్డాడు. స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేసి నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాంపూర్ గ్రామానికి చెందిన వెంకటరమణ బావ ప్రకాష్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై శంకర్ తెలిపారు.

కడెం ఆయకట్టుకు నీరు ఇవ్వాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కడెం ఆయకట్టుకు ఏప్రిల్ చివరి వరకు సాగు నీరు ఇవ్వాలని కోరుతూ ఆర్డీవోకు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం వినతిపత్రం అందజేసింది. ఎస్ఆర్ఎస్పీ ద్వారా రావలసిన నీటిని సక్రమంగా వినియోగించి పంటలు ఎండిపోకుండా చూడాలని కోరారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 86 అర్జీలు వచ్చాయని తెలిపారు. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పరిష్కానానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఎండలు తీవ్రస్థాయిలో ఉన్నందున జిల్లాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. వడ దెబ్బతో అనారోగ్యానికి గురై ఆసుపత్రులకు వచ్చే రోగులకు అన్ని రకాల మందులు, సెలైన్ బాటిళ్లు, ఓఆర్ఎస్ పొట్లాలు తగినన్ని అందుబాటులో ఉంచాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలన్నారు. జిల్లాలో కొయ్య బొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి కర్రను సమకూర్చుకోవడానికి పొనికి వనాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు డీఆర్డీవో విజయలక్ష్మిని కలెక్టర్ అభినందించారు. జిల్లా అధి కారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమకూర్చిన స్టీల్ నీళ్ల సీసాలను కలెక్టర్ అధికారులకు అందించారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించడంలో భాగంగా స్టీల్ నీళ్ల సీసాల వైపు మళ్లిన అధికారులను కలెక్టర్ అభినందించారు. అన్ని కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని ఈ కలెక్టర్ సందర్భంగా తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఎంజేపీ విద్యార్థుల వివాదంపై అధికారుల విచారణ

- కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అధికారి రత్నాకర్‌రావు కౌన్సెలింగ్
- ఘటనపై పోలీసుల ఆరా దాడికి పాల్పడిన విద్యార్థులపై కేసు నమోదు



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న కళాశాల ప్రత్యేక అధికారి రత్నాకర్ రావు

ఖానాపూర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌కు చెందిన మహాత్మా జ్యోతి బాపూలే బాలుర కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల నడుమయ నెలకొన్న వివాదంపై అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ప్రత్యేక అధికారి ఎంపీవో రత్నాకర్ రావు విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కళాశాలలో మరోసారి ఇటువంటి ఘనటలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యార్థులను హెచ్చరించారు. కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న తరుణ్ అనే విద్యార్థిపై సెకండ్ ఇయర్ విద్యార్థి పవన్, తనయ్ అనే విద్యార్థులు దాడి చేయడంతో తలకు గాయమైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై ఖానాపూర్ సీఐ అజయ్ ఎస్సై రాహుల్‌గైక్వాడ్‌లు సైతం విచారణ నిర్వహించారు. కళాశాలను సందర్శించి జరిగిన విషయాన్ని విద్యార్థుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో పవన్, తనయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఈ ఘటనతో ఎంత మంది విద్యార్థులకు సంబంధం ఉందనే విషయంపై విచారణ నిర్వహిస్తున్నామని ఈ విచారణలో తేలిన అంశాలను బట్టి ఎంతమందిపై కేసు నమోదు చేస్తామన్నది త్వరలో వెల్లడిస్తామన్నారు.



విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

10 లోగా అగ్నిపథ్ నమోదు చేసుకోవాలి

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అగ్నిపథ్ పథకం అగ్నివీర్ నియామకాలకు రిజిస్టర్ చేసుకునేందుకు ఏప్రిల్ 10 గడువు అని ఇంటర్మీడియట్ విద్యాధికారి జే. పరుశరాం ఒక ప్రకటనలో తెలిపారు. అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అగ్నివీర్ టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్, ట్రేడ్స్ మెన్ తదితర క్యాటగిరీలలో నియామకాలుంటాయన్నారు. టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని, 17 నుండి 21 లోపు వయసు ఉండాలన్నారు.

రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేయండి

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాస్ పథ కం కోసం గిరిజన తెగల నిరుద్యోగులు ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమ అధికారి జే. అంబాజీ ఒక ప్రకటనలో కోరారు. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు.

అంగన్‌వాడీల ధర్నాకు సీపీఎం మద్దతు



నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు నిర్వహించనున్న రెండు రోజుల ధర్నాకు మద్దతు ఇస్తున్నట్లు సీపీఎం ప్రకటించింది. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా శిబిరానికి కార్యదర్శి వర్గ సభ్యుడు డి. నూతన్ కుమార్ హాజరై మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన కార్మికులు, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలులో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీల టీచర్లకు రూ. 18 వేల వేతనం చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు డి. తిరుపతి, బి. సురేష్ పాల్గొన్నారు.

నదిలో దూకిన మహిళ.. కాపాడిన స్థానికులు



విచారణ చేపడుతున్న పోలీసులు

బాసర, మార్చి, 17 : (ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి తీరంలో సోమవారం ఓ వృద్దురాలు నదిలో దూకగా వెంటనే స్థానికులు గమనించి రక్షించారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలానికి చెందిన వృద్దురాలు కుటుంబ సభ్యులతో బాసరకు వచ్చింది. నది వద్ద స్నానఘట్టం నుంచి నదిలోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా వెంటనే అక్కడ ఉన్న స్థానికులు గమనించి అడ్డుకున్నారు. ఒడ్డుకు తీసుకెళ్లి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి సదరు వృద్దురాలిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో వృద్దురాలిని రక్షించిన స్థానికులను పోలీసులు అభినందించారు.

ఆర్టీసీ కార్మికులకు మజ్జిగ పొట్లాల పంపిణీ

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఆర్టీసీ డిపోలో పని చేసే కార్మికులకు సోమవారం డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మజ్జిగ పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగులకుండా ఉండేందుకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. వేసవికాలం ముగిసే వరకు మజ్జిగ పంపిణీ కొనసాగుతుందని, కార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. సహా మేనేజర్ రాజశేఖర్, ఏఈ నవీన్ కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సర్వే

నిర్మల్ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వైఎస్ఆర్ కాలనీ సమస్యలపై సోమవారం ప్రజా సర్వే నిర్వహించినట్లు సీపీఎం టౌన్ సెక్రటరీ తొడసం శంభు తెలిపారు

బీసీ రిజర్వేషన్ బిల్లు చారిత్రాత్మకం

నిర్మల్ కల్చరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బీసీ రిజర్వేషన్ పెంపు బిల్లు చారిత్రాత్మక నిర్ణయమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టిశేఖర్ ప్రకటనలో తెలిపారు